సాక్షి చిత్తూరు

బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



అలసి..సొలసి

సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రజలు విసిగిపోతున్నారు. - 8లో



విషం చిమ్ముతున్న..

శాంతిపురం మండలంలో ఓ ఆహార పరిశ్రమ విషం చిమ్ముతోంది. స్థానికులను ముప్పతిప్పలకు గురిచేస్తోంది. - 8లో



ప్రాణం తీసిన ఫ్లెక్సీ

చిత్తూరులో టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందాడు. ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

హంద్రీ-నీవా నీటి ప్రవాహానికి అంతరాయం



నీరు ఇంకిన కాలువ

శాంతిపురం: సాంకేతిక సమస్యతో హంద్రీ-నీవా కుప్పం కెనాల్‌లో నీటి ప్రవాహానికి మంగళవారం అంతరాయం ఏర్పడింది. వి.కోట మండలం, ఆదినేపల్లి వద్ద ఉన్న పంప్ హౌస్‌లో స్టార్టరు బాక్సులోకి పాము చొరబడింది. దీంతో స్టార్టర్, మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. పంపింగ్ ఆగిపోయింది. మంగళవారం ఉదయం నుంచి కాలువలో నీటి ప్రవాహం తగ్గిపోయింది. మధ్యాహ్నం తర్వాత పూర్తిగా ఆగిపోయింది. కాలువలో నీరు ఆగిపోవడంతో సోషల్ మీడియాలో దీనిపై విస్తృత చర్చ సాగింది. నీరు ఇంకిన కాలువ ఫొటోలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేశాయి. మరమ్మతుల అనంతరం మంగళవారం సాయంత్రం 3 గంటల నుంచి మళ్లీ నీటి పంపింగ్‌ను ప్రారంభించారు.

బోర్డులు నాటారు.. తీసేశారు!



బోర్డును నాటుతున్న రెవెన్యూ సిబ్బంది

శాంతిపురం: ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోని భూమి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు నాటిన రెవెన్యూ అధికారులు మళ్లీ గంటల వ్యవధిలోనే వాటిని తొలగించారు. మండల సచివాలయ సమీపంలో కరేగానూరు వద్ద డొంకుమాకనపల్లి రెవెన్యూలోని 2.08 ఎకరాల భూమిని ఓ వ్యక్తి ఆక్రమించాడని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సర్వే చేసిన రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. శనివారం మధ్యాహ్నం తర్వాత తహసీల్దారు శివయ్య ఆధ్వర్యంలో ఆ భూమిలో బోర్డులు నాటారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాలతో పొద్దువాలాక మళ్లీ ఆ బోర్డులను తొలగించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

పాడి రైతులకు విరివిగా రుణాలు



కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పాడి రైతులకు బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజల జీవనోపాధికి స్థిరమైన ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాలకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. రైతుల్లో పాడి పరిశ్రమ, ఫౌల్ట్రీ రంగంపై ఆసక్తి ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఆ జాబితాకు అనుగుణంగా అవసరమైన ఆర్థిక సహాయం అందించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే పాడి రైతుల అభివృద్ధికి రూ.7 కోట్లు అందజేసినట్టు కలెక్టర్ వెల్లడించారు.

పంటలు ధ్వంసం



బోడిరెడ్డిగారిపల్లెలో ధ్వంసమైన వేరుశనగ పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఏనుగుల దాడులు పెచ్చుమీరుతున్నాయి. పాతపేట, బోడిరెడ్డిగారిపల్లె, చల్లావారిపల్లె పంచాయతీల్లో మంగళవారం తెల్లవారు జామున 13 ఏనుగులు పొలలపై దాడి చేశాయి. చల్లావారిపల్లెలో రాగి పంట, బోడిరెడ్డిగారిపల్లెలో వరి, పాతపేటలో కొబ్బరి చెట్లు, మతుకువారిపల్లెలో వేరుశనగ పంటను తొక్కి నాశనం చేశాయి. అటవీ అధికారులు స్పందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్ : అపోలో యూనివర్సిటీలో మంగళవారం రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ పరిశీలనలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు. డీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. మొత్తం 45 మంది అభ్యర్థులకు గాను 37 మంది హాజరై సర్టిఫికెట్లను పరిశీలించుకున్నారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

వైద్య పరీక్షల తేదీ మార్పు

చిత్తూరు అర్బన్: కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నిర్వహించాల్సిన వైద్య పరీక్షల్లో స్వల్ప మార్పు చేసినట్లు చిత్తూరు ఎస్పీ మణికంఠ తెలిపారు. 5వ తేదీన హాజరు కావాల్సిన అభ్యర్థులకు 8వ తేదీకి మార్చామని, 7న హాజరుకావాల్సిన అభ్యర్థులు 9, 10 తేదీల్లో వైద్య పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

‘మహా’నివాళి

పేదల గుండె గుడిలో గూడుకట్టుకున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డికి జిల్లా ప్రజలు ఘన నివాళి అర్పించారు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూల మాలలు వేసి అంజలి ఘటించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు మిన్నంటించారు. పేదల పెన్నిధివైన నిన్ను ఎలా మరిచేది రాజన్నా అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆయన సేవా కార్యక్రమాలను తలచుకుని పులకించిపోయారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాల్లో తరలించారు. వాడవాడలా పేదలకు అన్నదానం చేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేసి తమ సేవానిరతిని చాటారు.

చిత్తూరు: అంజలి ఘటిస్తున్న విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్



జిల్లాలో వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

- పేదల సేవల్లో తరలించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- మార్మోగిన జోహార్ వైఎస్సార్ నినాదాలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో వాడవాడలా దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డికి ఘన నివాళులర్పించారు. పార్టీలకతీతంగా పలువురు వైఎస్సార్‌కు నివాళి అర్పించారు. ఆయన సేవా కార్యక్రమాలను కొనియాడారు. జిల్లా ప్రజలపై రాజన్నకున్న మక్కువను గుర్తుచేసుకుని ఉప్పొంగిపోయారు. జోహార్ వైఎస్సార్..! వైఎస్సార్.. అమరరహే అంటూ నినాదాలు మిన్నంటించారు.

- పలమనేరు నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ వర్ధం కార్యక్రమాలు చేపట్టారు. వి.కోటలో మండల కన్వీనర్, ఎంపీపీ యువరాజు, రాష్ట్ర కార్యదర్శి పీఎస్.నాగరాజు ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు పట్టణంలో పట్టణ అధ్యక్షుడు హేమంత్‌కుమార్‌రెడ్డి, రూరల్ కన్వీనర్ బాలాజీనాయుడు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించారు.
- పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాళి అర్పించి అంజలి ఘటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.
- చిత్తూరు నగరంలోని డీసీసీ బ్యాంకు వద్ద వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్ నివాళి అర్పించారు. సంతపేటలో మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అక్కడ మెడికల్ క్యాంప్ నిర్వహించి 200 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం అల్పాహారం అందించారు. మధ్యాహ్నం మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి, మాజీ చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి అన్నదానం చేశారు. జెడ్పీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. గుడిపాల మండలంలో విజయానందరెడ్డి నివాళి అర్పించారు.
- పూతలపట్టు మండలం, బండపల్లె గ్రామంలో మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. నాయకులు బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు. బంగారుపాళ్యం మండలం, కరిడివారిపల్లెలో మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, లలితకుమారి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి తదితరులు పాల్గొని నివాళి అర్పించారు.
- జీడీనెల్లూరులో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, పెనుమూరులో ఎంపీపీ హేమలతరెడ్డి, మండల కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, కార్వేటినగరంలో ఎంపీపీ లతా, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, ఎస్ఆర్‌పురంలో మండల కన్వీనర్ మణి ఆధ్వర్యంలో నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించారు. జీడీనెల్లూరు, పెనుమూరులో పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. పెనుమూరులో మాజీ ఎంపీ, మాజీ విదేశీ వ్యవహారాల సలహాదారుడు జ్ఞానేంద్రరెడ్డి పాల్గొన్నారు.



వి.కోట: జోహార్ వైఎస్సార్ అంటూ నినదిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



పుంగనూరు: నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప

- కుప్పం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ కౌన్సిలర్లు హఫీస్, మోహన్‌రామ్, మణి, మునిరాజ్, ఇళయరాజా, విజయ్, నాగరాజు నివాళి అర్పించారు. గుడిపల్లె మండలంలో పొగురుపల్లె క్రాస్ వద్ద వైఎస్సార్ స్మారకానికి నివాళి అర్పించారు. జెడ్పీటీసీ కృష్ణమూర్తితో సహా పార్టీ నాయకులు పాల్గొన్నారు. శాంతిపురం మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ కోదండరెడ్డి, రామకుప్పంలోని వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి తదితరులు నివాళి అర్పించారు.



కుప్పం: నివాళి అర్పిస్తున్న కౌన్సిలర్లు, నాయకులు



పలమనేరు: శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ



పూతలపట్టు: అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్



పెనుమూరు: అన్నదానం చేస్తున్న కృపాలక్ష్మి, జ్ఞానేంద్రరెడ్డి

- నగరి, పుత్తూరు మండలం, మున్సిపాలిటీలలో మాజీ మంత్రి ఆర్కేరోజా సోదరులు కుమారస్వామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. నగరి బస్టాండు ప్రాంగణంలోని టవర్‌క్లాక్ సెంటర్, ఓంశక్తి ఆలయ బైపాస్ కూడలి వద్ద, పుత్తూరు పున్నమి సర్కిల్ వద్ద గల వైఎస్ఆర్ విగ్రహాలకు పూలదండలు వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి ఎంపీపీలు భార్గవి, మునివేలు పాల్గొన్నారు.



నగరి: బస్టాండ్ ప్రాంగణంలో నివాళి అర్పిస్తున్న నాయకులు కుమారస్వామి, పార్టీ శ్రేణులు

‘సాక్షి’ ఎడిటర్‌పై కేసు అప్రజాస్వామికం



చిత్తూరు వన్‌టౌన్ స్టేషన్ ఎదుట పాత్రికేయుల నిరసన

- చిత్తూరులో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ సభ్యుల నిరసన
- పత్రికా స్వేచ్ఛను కాపాడాలని నినదించిన జర్నలిస్టులు
- పోలీసులకు వినతి పత్రం అందజేసిన పాత్రికేయులు



చిత్తూరులో సీఐకి వినతిపత్రం అదజేస్తున్న జర్నలిస్టులు

చిత్తూరు అర్బన్: అధికారులకు అనుకూలంగా పత్రికల్లో వార్త రాయకుంటే కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని పాత్రికేయులు ప్రశ్నించారు. పత్రికల్లో ప్రచురితమైన వార్త తమకు నచ్చలేదనే కారణంతో.. పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ అక్రమ కేసులు పెట్టడం భావ్యం కాదన్నారు. ‘సాక్షి’ ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసు నమోదు చేయడాన్ని నిరశిస్తూ చిత్తూరులో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే), చిత్తూరు ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరులో పాత్రికేయులు నిరసన వ్యక్తం చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎం.లోకనాథన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలువురు డీఎస్పీలకు పదోన్నతులు రావాల్సి ఉండగా, ఆలస్యం చేయడం వెనుక అక్రమాలు జరిగాయనే కోణంలో ‘సాక్షి’ పత్రికలో వార్త ప్రచురితమైందన్నారు. ఈ వార్తలో ఏదైనా అభ్యంతరకరమైన విషయం ఉంటే అధికారులు ఖండించాల్సిం ఉందన్నారు. అలా కాదని ‘సాక్షి’ ఎడిటర్ ధనంజయరెడ్డిపై కేసు నమోదు చేయడం పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమేనన్నారు. దీనిపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే పలు కేసుల్లో స్పష్టత కూడా ఇచ్చిందన్నారు. భావ వ్యక్తీకరణను తెలియచేసే పత్రికల నిర్వాహకులపై కేసులు పెట్టడం సమాజానికి మంచిది కాదన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్ కార్యదర్శి వై.కాలేశ్వరరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెఎం.అశోక్‌కుమార్ మాట్లాడుతూ నిజాలు రాసే జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజలకు మధ్య పాత్రికేయులు వారధిలా పనిచేస్తున్నారన్నారు. నిజాలను పత్రికల ద్వారా ఎత్తి చూపినపుడు వాటిని సరిదిద్దుకోవాల్సిందిపోయి.. తప్పుడు కేసులు పెట్టడం తగదన్నారు. ‘సాక్షి’ ఎడిటర్‌పై నమోదు చేసిన అక్రమ కేసును ఎత్తివేయాలని చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వరకు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు శివప్రసాద్, కార్యవర్గ సభ్యులు బాలసుందరం, చంద్రశేఖర్, ఏపీయూడబ్ల్యూజే సభ్యులు సురేష్, చంద్రప్రకాష్, హరీష్, శ్రీనివాసులు, చిరంజీవి, ప్రవీణ్‌సాయి, జయకుమార్ పాల్గొన్నారు.

అత్యవసర సేవలకు ప్రథమ ప్రాధాన్యం



నూతన అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలకు అత్యవసర సేవలందించడం ప్రథమ ప్రాధాన్యంగా భావిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం నూతన అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాత అంబులెన్స్‌ల స్థానంలో కొత్త అంబులెన్స్‌లను తీసుకొచ్చి అత్యవసర సేవలందించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి సంబంధించి పాత అంబులెన్స్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఏవోసీఎల్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ పథకంలో కొత్త అంబులెన్స్‌ను త్వరలో కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వాస్పత్రిలో అంబులెన్స్‌ల సంఖ్య మూడుకు చేరుతుందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, మేయర్ అముద, ఎన్టీఆర్ వైద్య సేవ కో–ఆర్డినేటర్ డా.సుదర్శన్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు కంచె



సాక్షి ఎఫెక్ట్..

కంచె ఏర్పాటు చేస్తున్న కమిషనర్

పుంగనూరు: పట్టణంలోని పీఎల్ఆర్ మినీబైపాస్ రోడ్డులో గల రాయలచెరువు వంకపోరంబోకు స్థలానికి ఎట్టకేలకు మున్సిపల్ కమిషనర్ మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో కంచె ఏర్పాటు చేశారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కాగా గత నెల 25న ‘వంకపోరంబోకు స్థలం కబ్జా’ శీర్షికన సాక్షిలో కథనం వెలువడింది. దీనిపై తహసీల్దార్ స్పందించి ట్రెంచ్ ఏర్పాటు చేశారు. కమిషనర్ స్థలాన్ని పరిశీలించి సర్వే నం.110/1లోని 81 సెంట్లు కబ్జా కాకుండా తక్షణమే కంచె ఏర్పాటు చేశారు. ఇందులో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి మున్సిపల్ ఆదాయాన్ని పెంపొందించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు.

గజ గణపతి!



కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం గజ వాహనంపై ఊరేగుతూ స్వామివారు కనువిందు చేశారు. ఉదయం శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను సర్వంగా సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. రాత్రి అలంకార మండపంలో గణనాథుని ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి గజ వాహనంపై కొలువు దీర్చారు. పురవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగింపు చేపట్టారు.

రథోత్సవానికి సర్వం సిద్ధం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

తప్పని నిరీక్షణ



కార్వేటినగరం వచ్చిన దివ్యాంగులు



డాక్టర్లు లేక ఖాళీ కుర్చీలతో సదరమ్ క్యాంపు గది

సదరమ్ సర్టిఫికెట్ల కోసం దివ్యాంగుల ఎదురు చూపు

- ఉదయం 11 దాటినా కానరాని వైద్యులు
- ఆపసోపాలు పడిన అభాగ్యులు

కార్వేటినగరం: అసలే దివ్యాంగులు. ఆపై వందల కిలోమీటర్ల ప్రయాణం. ఆపసోపాలు పడి తమకు సూచించిన ఆస్పత్రికి తరలివచ్చారు. తమ వికలత్వాన్ని పరీక్షించుకుని సర్టిఫికెట్లు పొందాలని ఆశపడ్డారు. కానీ స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లు ఉదయం 11 దాటినా రాకపోవడంతో నిరుత్సాహంతో కుమిలిపోయారు.



ధర్మవరం నుంచి వచ్చాము

మాది అనంతపురం జిల్లా, ధర్మవరం గ్రామం. మేము సదరమ్ సర్టిఫికెట్ల కోసం మూడు నెలలకు ముందు స్లాట్ బుక్ చేసుకున్నాము. మాలాంటి వారికి వందల కిలోమీటర్ల దూరంలోని ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఆలస్యంగా బుక్ చేసుకున్న వారికి దగ్గర్లో ఉన్న ఆస్పత్రుల్లో అనుమతులిచ్చారు. కష్టాలకోర్చి ఇంత దూరం వచ్చాము. ఉదయం 11 గంటలవుతున్నా ఇంతవరకు వైద్యులు రాలేదు. సీహెచ్‌సీలో 12 మంది డాక్టర్లు ఉన్నా ఏ ఒక్కరూ సమయపాలన పాటించలేదు.

– హరిప్రసాద్, ధర్మవరం, అనంతపురం జిల్లా

160 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చా



మాది వెంకటగిరి నియోజకవర్గంలోని కోట. నేను మేలో స్లాట్ బుక్ చేసుకున్నాను. మాకు 160 కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్వేటినగరం ఆస్పత్రికి రెఫర్ చేశారు. అంతదూరం రాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాము. ఉదయం 11 గంటలైనా మమ్మల్ని ఎవ్వరూ పట్టించుకోలేదు. అల్పాహారం కావాలన్నా ఇక్కడి నుంచి కిలోమీటరు దూరం వెళ్లాల్సి వస్తోంది.

– భానుమూర్తి, కోట, తిరుపతి జిల్లా

డాక్టర్లు డెప్యూటేషన్లపై వెళ్లారు

డాక్టర్లు డెప్యూటేషన్లపై వెళ్లారు. సదరమ్ క్యాంపు నిర్వహించే డాక్టర్ నైట్ డ్యూటీ చేశారు. అలాగే ఇప్పుడు ఓపీ చూస్తున్నారు. అందుకే ఆలస్యమైంది.

– డాక్టర్ భాగ్యలక్ష్మి, సీహెచ్‌సీ వైద్యాధికారిణి

క్లుప్తంగా

13న జాతీయ లోక్‌అదాలత్



న్యాయమూర్తి భారతి

చిత్తూరు లీగల్: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈనెల 13వ తేదీన జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ ప్రిన్స్‌పల్ సివిల్ జడ్జి భారతి తెలిపారు. సోమవారం చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలోని జిల్లా న్యాయ సేవాసదన్ భవనంలో ఆమె మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పెండింగ్ కేసుల పరిష్కారం కోసం జాతీయ అదాలత్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్ ఇతర కేసులను అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. కక్షిదారులకు ఏవైనా సందేహాలు ఉంటే చిత్తూరు కోర్టులో డీఎల్ఎస్ఏ భవనంలో సంప్రదించాలని కోరారు. కాగా జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో 96,647 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

చిత్తూరులో వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో మోహన్ (43) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సీఐ మహేశ్వర కథనం మేరకు.. నగరంలోని కట్టమంచికి చెందిన మోహన్‌కు పెళ్లయ్యి పిల్లలున్నారు. అనారోగ్యం కారణంగా మద్యానికి బానిసయ్యాడు. భార్య కూడా గత కొంతకాలంగా ఇతనికి దూరంగా ఉంటోంది. సోమవారం కట్టమంచి–తిరుపతి రోడ్డులోని బ్రిడ్జి కింద ఉన్న పొలాల్లో ఓ చెట్టుకు పంచెతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలుస్తోంది. పోలీసులకు ఆలస్యంగా సమాచారం అందడంతో మృతదేహాన్ని పరిశీలించి, చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

యాదమరి: ఖననం చేసిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు కథనం.. శ్రీరంగరాజపురం మండలం, పాత పాళ్యం దళితవాడకు చెందిన రమేష్ కుమార్తె పూజ(25)ను యాదమరి మండలం, వరదరాజులపల్లికి చెందిన పెరియస్వామి కుమారుడు శేఖర్(33)కి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అయితే శేఖర్ కుటుంబ సమస్యల వల్ల ఏడాది క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త మరణానంతరం పూజ దినసరి కూలీగా మారిపోయింది. గత నెల ఆడి కృత్తిక సందర్భంగా కావడి ఎత్తడానికి తన పుట్టింటికి వెళ్లింది. అయితే అక్కడ ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలి తల్లి వరదరాజులపల్లిలోని పూజ అత్తవారికి, బంధువులకు సమాచారం అందించింది. దీంతో వారు పూజ మృతదేహాన్ని వరదరాజులపల్లిలోని శ్మశాన వాటికలో ఖననం చేశారు. అయితే తమ కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతురాలి తల్లి రాధమ్మ రెండు రోజుల క్రితం ఎస్ఆర్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్ మంగళవారం వరదరాజులపల్లికి వచ్చి ఖననం చేసిన పూజ మృతదేహాన్ని స్థానిక తహసీల్దార్ పార్థసారథి సమక్షంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రి పోస్టుమార్టం నిర్వహించారు. కాగా అక్కడి పోలీసులు వరదరాజులపల్లిలోని మృతురాలి బంధువులను విచారించినట్లు సమాచారం.

గత ప్రభుత్వంలో అర్జీలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. పర్యవేక్షణ లేమి.. పాలకుల ఉదాసీనత వెరసి గ్రీవెన్స్ తూతూ మంత్రంగా నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. అర్జీదారులు గత ప్రభుత్వం మాదిరిగా సమస్యలు పరిష్కరించుకోవచ్చని కలెక్టరేట్‌తో పాటు మండల కేంద్రాలకు క్యూ కడుతున్నారు. నెలల తరబడి అర్జీలిస్తూ అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. కానీ ఏం లాభం..?. అధికారులు స్పందించక.. సమస్య పరిష్కారంగాక.. ముప్పుతిప్పలు ఎదుర్కొంటున్నారు.

SAKSHI గ్రౌండ్ రిపోర్ట్ GROUND REPORT



పీజీఆర్ఎస్‌లో అర్జీలు అందజేస్తున్న ప్రజలు

అలసి.. సొలసి!

అర్జీల పరిష్కారం అంతంతమాత్రమే

- ఏమార్చి సంతకం చేయించుకుంటున్న అధికారులు
- సమస్య పరిష్కరించేశామంటూ తప్పుడు నివేదికలు
- పలుకుబడి ఉంటేనే పరిష్కరిస్తున్నారంటున్న అర్జీదారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌తో పాటు, ఆర్డీవో, నగరపాలక, మున్సిపల్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ (ప్రజాసమస్యల పరిష్కార వేదిక)ను ప్రతి సోమవారం నిర్వహిస్తున్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అర్జీదారులకు న్యాయం జరగడం లేదు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పదే పదే ఆదేశిస్తున్నా క్షేత్ర స్థాయి అధికారులకు చలనం లేకుండా పోతోంది. ఫలితంగా అర్జీదారులు న్యాయం కోసం పదేపదే పీజీఆర్ఎస్‌లో అర్జీలు ఇస్తూనే ఉన్నారు.

ఏమార్చి.. సంతకాలు చేయించుకుని

పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీ పరిష్కారానికి సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. వాస్తవంగా ఎవరికైతే న్యాయం జరగాలో వారికి న్యాయం చేయాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని పలు మండలాల్లో అలా జరగడం లేదు. ఉన్నతాధికారుల నుంచి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించడంలో ఆయా శాఖల అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వచ్చినప్పుడు చూసుకుందాంలే అనే నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఒత్తిడి ఎక్కువైనప్పుడు అర్జీదారుల నుంచి తెల్లకాగితంలో సంతకం చేయించుకుని సమస్య పరిష్కరించినట్లు ఏమారుస్తున్నారు.

కార్యాలయాలకే పిలిపించుకుని!

పీజీఆర్ఎస్‌లో అధిక శాతం రెవెన్యూ సమస్యలే నమోదవుతున్నాయి. ఆ సమస్యలను సంబంధిత తహసీల్దార్లు సకాలంలో పరిష్కరించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో పలు చోట్ల ఆస్తి తగాదాలు, రెవెన్యూ సమస్యలు ఎక్కువై ఒకరినొకరు చంపుకునే స్థాయికి వస్తున్నారు. రెవెన్యూ సమస్యలను క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించి పరిష్కరించకుండా అర్జీదారులను కార్యాలయాలకు పిలిపించుకుంటున్నారు. ఆపై అర్జీదారులకు మాయ మాటలు చెప్పి సంతకాలు చేయించుకుని పంపించేస్తున్నారు. అధికారుల తీరు వల్ల రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోక కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నట్టు తెలుస్తోంది.

చెరువు కాలువను ఆక్రమించారన్నా..



అర్జీదారుడు బాబు

చెరువు కాలువను ఆక్రమించారని ఐరాల మండలానికి చెందిన బాబు మే 5న పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేశారు. అంతకుముందు ఐదు సార్లు మండలాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. కొందరు స్వార్థపరులు చెరువు కాలువను ఆక్రమించుకుని పొలానికి దారిలేకుండా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు క్షేత్రస్థాయి అధికారులకు వెళ్లింది. సమస్యను పరిష్కరించకుండా అర్జీని పరిష్కరించేశామంటూ అధికారులకు నివేదికిచ్చారు. ఇప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.

తొమ్మిది సార్లు అర్జీలందజేసినా..



ఏప్రిల్ 7వ తేదీన పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరుతున్న కొత్తూరు ఎస్టీ కాలనీ వాసులు

సొంత గృహాల కోసం గంగాధరనెల్లూరు మండలం, కొత్తూరు ఎస్టీ కాలనీ వాసులు ఇప్పటికి 9 సార్లు పీజీఆర్ఎస్‌లో అర్జీలు అందజేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 7వ తేదీ నుంచి గత నెల వరకు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు తొమ్మిది సార్లు అర్జీలు అందజేశారు. సంవత్సరాల తరబడి పూరి గుడిసెల్లో ఉంటున్నామని, 14 కుటుంబాలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని అర్జీ పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు వారి న్యాయం జరగలేదు.

పది సార్లు అర్జీ ఇచ్చినా..



ఏప్రిల్ 7న సమస్యను వెల్లడిస్తున్న కంబాల చేను గ్రామస్తులు

కబ్జాదారులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని పెనుమూరు మండలం, కంబాల చేను గ్రామస్తులు ఇప్పటికి పది సార్లు అర్జీ ఇచ్చినా పురోగతి శూన్యం. ఆ గ్రామంలోని 902 సర్వే నం.1.78 ఎకరాలు రాస్తా, సర్వే నం.985లో 44 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఆ గ్రామస్తులు అర్జీ ఇచ్చారు. మండల రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

ఏడు సార్లు అర్జీ ఇచ్చినా..



అర్జీదారుడు నాగభూషణం, కుటుంబ సభ్యులు

ఇప్పటికీ పీజీఆర్ఎస్‌లో ఏడు సార్లు అర్జీ ఇచ్చినా పరిష్కారం శూన్యం. పెనుమూరు మండలానికి చెందిన నాగభూషణం తమ ఇంటికి వెళ్లే దారిని ఆక్రమించుకున్నారని, న్యాయం చేయాలంటూ మే 5వ తేదీన పీజీఆర్ఎస్‌లో అర్జీ ఇచ్చారు. అంతకుముందు ఆరు సార్లు మండల స్థాయిలో అధికారులకు అర్జీ అందజేశారు. సర్వే నం.467/1ఏలోని 20 సెంట్ల భూమిలో గత 30 ఏళ్లుగా నివసిస్తున్నట్లు నాగభూషణం అర్జీలో పేర్కొన్నారు. సంబంధిత స్థలంలో తమ ఇంటికి వెళ్లే దారి సర్వే నం.468/1లో కుంటపోరంబోకు స్థలం ఉందని, గత 30 ఏళ్లుగా ఆ దారినే వినియోగించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆ దారిని మరొకరు ఆక్రమించుకోవడంతో పలుమార్లు అధికారులకు అర్జీ ఇచ్చినా న్యాయం జరగని దుస్థితి.

ఎగ్‌ఫీజు వేయాలంటే రూ.300 ఇవ్వాల్సిందే

- ఇష్టారాజ్యంగా లైన్‌మెన్ల వసూళ్లు
- రైతులు ప్రశ్నిస్తే ఇక అంతే
- చౌడేపల్లి మండలంలో ఇదీ పరిస్థితి



చౌడేపల్లె మండలం, కోటూరు వద్ద ఎగ్‌ఫీజు వేస్తున్న ప్రయివేటు వ్యక్తి

చౌడేపల్లె: మండలంలో లైన్‌మెన్ల పనితీరు రోజురోజుకూ తీసికట్టుగా మారుతోంది. పర్యవేక్షణ లేమి.. ఉన్నతాధికారుల ఉదాసీనత కారణంగా తమ చేతికి పనిచెబుతున్నారు. ప్రయివేటు వ్యక్తులను నియమించుకుని వారి చేత పనులు చేయిస్తూ రైతులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇక వారిసంగతి అంతే..! ఇలాంటిదే మండలంలోని కొండామర్రిలో వెలుగుచూసింది. మంగళవారం కోటూరు సమీపంలో ఓ రైతు బోరుకు సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌కు 11 కేవీ లైను వద్ద ఎగ్‌ఫీజు కట్ అయ్యింది. ఆ రైతు లైన్‌మన్‌కు సమాచారమిచ్చారు. రూ.300 ఇస్తేనే వచ్చి ఎగ్‌ఫీజు వేస్తామని సంబంధిత లైన్‌మన్ రైతుకు బదిలిచ్చాడు. ససేమిరా అనడంతో ఆ రైతు లైన్‌మన్ అడిగినంత ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ఓ ప్రయివేటు వ్యక్తి వచ్చి ఎగ్‌ఫీజు వేశాడు. అడిగినంత ఇవ్వకుంటే కన్నెత్తిచూడడని, ఫోన్ చేసినా స్పందించరని రైతు వాపోయాడు. మండలంలో మరికొన్ని చోట్ల రూ.500 వరకు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ శశిధర్‌ను వివరణ కోరగా లైన్‌మన్‌కు ఎలాంటి సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఇలాంటివి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా రూపేష్‌బాబు



చిత్తూరు కలెక్టరేట్ : చెన్నైలోని జీవ టెక్నిలాజికల్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా చిత్తూరుకు చెందిన డాక్టర్ రూపేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఝాన్సీరాణి ఉత్తర్వులు జారీచేశారు. ఏపీ పరిశ్రమల అభివృద్ధి సాధికారిక సంస్థ (అపిటీకో) రాష్ట్ర ఉపాధ్యక్షులు, రూపేష్ ఎడ్యుకేషనల్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రూపేష్‌బాబు సేవలను వినియోగించుకోవాలని జీవ టెక్నిలాజికల్ ఓపెన్ యూనివర్సిటీ భావించినట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రార్‌గా నియమితులైన రూపేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు. పలువురు జిల్లా వాసులు ఆయనకు అభినందనలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 15 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందికి రూ.1.5 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 15 మందిపై కేసు నమోదుచేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున మొత్తం రూ.1.5 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

గంజాయి విక్రయించిన వ్యక్తి అరెస్ట్

చిత్తూరు అర్బన్: గంజాయి విక్రయిస్తూ, తనిఖీల సమయంలో తప్పించుకున్న రాజా (45)ని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. జూలై 19న నగరంలోని కైలాశపురం వద్ద పోలీసులు తనిఖీలు చేశారు. గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి, 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో రాజా అనే వ్యక్తి పోలీసులను చూసి పారిపోయాడు. ఇతడిని పోలీసులు అరెస్టుచేసి, న్యాయస్థానం ఆదేశాలతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

జిల్లాలో 24 ఆర్ఎంపీ క్లినిక్‌ల సీజ్

కాణిపాకం: కలెక్టర్ ఆదేశాలకు జిల్లా వ్యాప్తంగా ఆర్ఎంపీ క్లినిక్‌లపై మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. 76 క్లినిక్‌లను తనిఖీ చేసి.. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 24 ఆర్ఎంపీ క్లినిక్‌ల ను సీజ్ చేశారు. సీజ్ చేసే క్రమంలో వైజాగ్ అధికా రులు పలు విషయాలను గుర్తించారు. వాటిని త్వరలో కలెక్టర్‌కు నివేదికల రూపంలో పంపనున్న ట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి పేర్కొన్నారు.

విషం చిమ్ముతున్న ఆహార పరిశ్రమ

- బుడ్డారెడ్డి కుంట వంకలోకి రసాయన వ్యర్థాలు
- ఆ ప్రాంతమంతా ఘాటైన వాసన
- కలుషిత నీరు కనిపించకుండా చెక్ డ్యాం ధ్వంసం
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



ధ్వంసం చేసిన చెక్ డ్యాం

శాంతిపురం: తమ గ్రామం వద్ద పరిశ్రమ వస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆశించిన రెడ్డివారిపల్లి వాసులకు కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. పరిశ్రమ నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థాలతో భవిష్యత్తుపై ఆందోళన నెలకొంది. దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం వారిని ఆవేదనకు గురిచేస్తోంది.

రాళ్లబూదుగూరు పంచాయతీలోని రెడ్డివారిపల్లి వద్ద రెండు నెలల క్రితం ఓ ఆహార పరిశ్రమ ప్రారంభమైంది. కూరగాయలను నిల్వచేసి, ఎగుమతి చేసేలా ప్రాసెస్ చేసే ఈ పరిశ్రమ నుంచి రసాయనాలు కలిసిన నీరు విడుదలవుతోంది. ఈ నీరు వెళ్లేందుకు చిన్నపాటి కాలువ చేసి పరిశ్రమ పక్కనే ఉన్న బుడ్డారెడ్డి కుంట వంకలోకి వదిలిపెట్టారు. వంక మొత్తం మీద రసాయనాలు కలిసిన నీరు ప్రవహిస్తూ కర్ణాటక సరిహద్దులోని కొత్తచెరువులోకి వెళ్తోంది. వంకపై నిర్మించిన నాలుగు చెక్ డ్యాంలు కూడా కలుషిత నీటితో నిండుతున్నాయి. దీంతో ఈ వంకలో కప్పలతో సహా ఇతర జీవరాశులేమీలేకుండా పోయాయి. వ్యర్థ నీటి నుంచి వస్తున్న ఘాటైన వాసనతో ఇబ్బందిగా ఉందని, పావు గంట ఉన్నా కళ్లల్లో నీరు కారుతూ ఊపిరి తీసుకోవడం కష్టమవుతోందని ఫ్యాక్టరీ పక్కన మైదానంలో క్రికెట్ ఆడే యువకులు పరిశ్రమ నిర్వాహకులకు తెలిపామన్నారు. దీంతో ఇటీవల ఫ్యాక్టరీ నిర్వాహకులు గుట్టుగా చెక్ డ్యాం గోడను పగులగొట్టి నీటిని కిందికి వదిలేయడంతో ఈ వ్యవహారాన్ని స్థానిక పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకుపోయారు. అయినా ప్రయోజనం లేకదని యువకులు వాపోతున్నారు. రసాయన నీరు వెళ్తున్న వంకకు ఇరువైపులా గడ్డి ఉన్న భూములు ఎక్కువగా ఉండడంతో ఈ ప్రాంతంలో స్థానిక గ్రామాల వారు తమ ఆవులు, జీవాలను మేపుతుంటారు. అవి పొరబాటున వంకలో నీరు తాగితే తమకు జీవనాధారంగా ఉన్న పెంపుడు జంతువులు బలవ్వడం ఖాయమని ఆందోళన చెందుతున్నారు. పరిశ్రమను నడుపుతున్న బడాబాబులను అడ్డుకునే శక్తి తమకు లేదని వాపోతున్నారు. దీనిపై పరిశ్రమ నిర్వాహకుల వివరణ కోసం ప్రయత్నించగా వినాయకచవితి పండుగకు వెళ్లిన సార్లు ఎవ్వరూ ఇంకా రాలేదని, వాళ్ల ఫోన్ నంబర్లు ఇవ్వలేమని సెక్యూరిటీ సిబ్బంది చెప్పారు.

ఎస్వీయూ లక్ష్య సాధనకు కృషి

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ స్థాపన లక్ష్యాలను నెరవేర్చే దిశగా కృషి చేద్దామని వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పేర్కొన్నారు. మంగళవారం వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 71వ వ్యవస్థాపక దినోత్సవ నేపథ్యంలో విశ్వవిద్యాలయ ఉద్యోగ బృందంతో కలిసి ప్రాంగణంలోని టంగుటూరి ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి, మహాత్మా గాంధీ, ఆచార్య గోవిందరాజులు, బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవస్థాపక దినోత్సవ సంబరాలు శ్రీనివాస ఆడిటోరియంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వీసీ ఆచార్య అప్పారావు మాట్లాడుతూ.. వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏర్పాటు వెనుక గల ఎంతో మంది మహనీయుల కలల్ని నెరవేర్చడానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఎస్వీయూ వరల్డ్, ఆసియా ర్యాంకింగ్స్‌లో రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందిందన్నారు. క్వాంటం టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ.. ఎందరో మహనీయులు ఎంతో ఉన్నత లక్ష్యంతో శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీని స్థాపించారని తెలిపారు. యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టిన క్రీడా సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. రిటైర్డ్ ఉద్యోగి విజయ్ కుమార్ మిమిక్రీతో అలరించారు.

ప్రాణం తీసిన ఫ్లెక్సీ

టీడీపీ ఫ్లెక్సీ కడుతూ.. విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- ఇందులో ఒకరు మైనర్



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఆనంద్ మృతదేహం

చిత్తూరు అర్బన్: అనుకున్నట్లే అయ్యింది. చిత్తూరులో విచ్చల విడిగా విపరీత ధోరణివైపు పరుగెడుతున్న ఫ్లెక్సీల సంస్కృతి ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వ్యక్తుల ఫ్లెక్సీలను కడుతూ.. విద్యుత్ షాక్ తగలడంతో ఆనంద్ (19) అనే యువకుడు దుర్మరణంపాలయ్యాడు. చిత్తూరు నగరంలో మంగళవారం ఈ విషాదం చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ మహేశ్వర కథనం మేరకు.. చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. పలువురు టీడీపీ నేతలు నగరంలో విస్తృతంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం చిత్తూరుతో పాటు తమిళనాడులోని వేలూరు నుంచి కూలీలను తీసుకొచ్చి ఫ్లెక్సీలు కట్టే బాధ్యతలను అప్పగించారు. ఈ నేపథ్యంలో వేలూరు నగరం, ఆర్ఎస్.నగర్‌కు చెందిన ఆనంద్, పరశురామన్ (40), గోగుల్ (15), అనే ముగ్గురు చిత్తూరు హైరోడ్డులోని ఓ బ్యాంకు వద్ద భారీ ఫ్లెక్సీను ఏర్పాటు చేయడానికి పైకి ఎక్కారు. అక్కడే ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ ఫ్లెక్సీకి ఉన్న ఇనుప చువ్వను తాకింది. ఒక్కసారిగా విద్యుత్ ప్రవాహం ఇనుపచువ్వకు రావడంతో ముగ్గురూ ఎగిరి అవతలి వైపు పడ్డారు. ముగ్గుర్నీ స్థానికులు హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆనంద్ మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఇక పరశురామన్, గోగుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో గోగుల్ మైనర్ బాలుడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎవరిదీబాధ్యత?

ఆనంద్ మృతికి ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అనధికారికంగా నగరంలో ఫ్లెక్సీలు నింపేస్తున్న రాజకీయ పార్టీ నాయకులా..? ఫ్లెక్సీలు, బ్యానర్లను నియంత్రించాల్సిన కార్పొరేషన్ అధికారులా..? అనుమతిలేకుండా పెడుతున్న ఫ్లెక్సీలు గాలీవానకు నేలకొరుగుతుంటే కేసులు నమోదు చేయకుండా చోద్యం చూస్తున్న పోలీసులా..? అనే ప్రశ్నలు సామాన్యుల వైపు నుంచి వెల్లువెత్తుతున్నాయి.



చికిత్స పొందుతున్న పరశురామన్